క్లుప్తంగా

28న అర్చక సంఘ సమావేశం

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు అర్చక సంఘం సభ్యులు డి.ప్రసన్నమూర్తి, ఆర్.పూర్ణానందశాస్త్రిలు తెలిపారు. ఈ మేరకు సంయుక్తంగా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో నూతనంగా అర్చక బ్రాహ్మణ సమాఖ్య సంఘం సభ్యులను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

28న ఉచిత కంటి వైద్య శిబిరం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్ వద్ద సాయిబాబా ఆలయంలో 28న సదావర్తి అన్నదాన సత్రం ఫౌండర్ ట్రస్ట్ (నుదురుపాడు) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ట్రస్ట్ నిర్వాహకులు గుర్రం నాగేశ్వరరావు, ఉషారాణిలు గురువారం ఈ వివరాలు తెలిపారు. ఎస్ఆర్ఐ మెడికల్ కళాశాల, చిన్నకాకాని నేత్ర వైద్య నిపుణులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. శుక్లాలు ఉన్న వారిని గుర్తించి పెద్ద ఆసుపత్రులలో ఉచితంగా ఆపరేషన్లు చేసి, మందులు అందజేస్తారని చెప్పారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ శిబిరం పరిశీలన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం-1 కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సవరణల శిబిరాన్ని గురువారం ఎంపీడీవో విమాదేవి పరిశీలించారు. ఆధార్ సెంటర్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పలు గ్రామాల్లో నిర్వహించే క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు తదితరులు ఉన్నారు.

22 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



వెలగపూడి(తాడికొండ): అక్రమంగా తరలించేందుకు రోడ్డు పక్కన సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు పట్టుకున్న ఘటన తుళ్ళూరు మండలం వెలగపూడిలో జరిగింది. బియ్యం మూటలుగా తరలించేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం అందుకున్న డీటీ అనిల్ కుమార్ వెంటనే దాడి నిర్వహించారు. మొత్తం 22 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమంగా తరలించడం నేరమని, ఎవరికైనా సమాచారం తెలిసినప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. బియ్యం దొరికినా తరలించే ముఠాకు చెందిన వ్యక్తులు ఎవరనేది ఇంకా తెలియలేదు.

వాటర్ ట్యాంకర్లపై కేసులు



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో నీళ్ల సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లకు సంబంధించిన పర్మిట్లు, లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్‌లు లేకుండా తిరిగే వాహనాలపై చర్యలు తీసుకోక తప్పదని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో పర్మిట్లు, పన్నులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని మూడు లారీ వాటర్ ట్యాంకర్లు, రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకర్ యాజమానులు తమ వాహనాలకు సంబంధించి అన్ని రోడ్డు పన్నులు, పర్మిట్లు, ఇన్సూరెన్స్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పక కలిగి ఉండాలని లేని పక్షంలో కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆర్ఎంపీల సమస్యలపై స్పీకర్‌కు వినతి

గుంటూరు మెడికల్: గ్రామీణ వైద్యుల(ఆర్ఎంపీ) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి తెలుగునాడు కమ్యూనిటీ పారామెడిక్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రవిచంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రసూల్, హనుమంతరావు గురువారం వినతిపత్రం అందజేశారు. గతంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో గ్రామీణ వైద్యుల సమస్యలను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి లోకేష్‌తో చర్చించి సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామని శాసనసభాపతి హామీ ఇచ్చినట్లు యూనియన్ నేతలు వెల్లడించారు.

ప్రధాన రహదారే.. సూచికలూ మరిచారే!

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- వాహనాలు ఆగక విద్యార్థుల పాట్లు



వేములూరిపాడులో పాఠశాల ఎదురుగా ఇదీ పరిస్థితి..

ఫిరంగిపురం: మండలంలోని గుంటూరు - కర్నూలు రాష్ట్ర రహదారిపై ప్రమాద సూచికలు, వాటిని తెలియజేసే బోర్డులు లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రహదారిపై వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయాల్సిన జీబ్రా గీతలు, ప్రమాద సూచికలు సంబంధిత శాఖ అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ప్రధాన రహదారిపై గల వేములూరిపాడు గ్రామంలోని పాఠశాల ఎదురుగా, ఫిరంగిపురంలోని పెట్రోలు బంకు, ఆర్సీజేసీ కళాశాల, మార్నింగ్‌స్టార్ కళాశాల, సెయింట్ ఆన్స్ పాఠశాల, సెయింట్ పాఠశాల, ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా, రేపూడిలోని స్టేట్ బ్యాంకు ప్రాంతంలో ప్రజలు, విద్యార్థులు రోడ్డు దాటేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. దీంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ఎక్కువ సమయం రోడ్డు దాటేందుకు చిన్న పిల్లలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సమయాల్లో స్పీడ్ బ్రేకర్ల వద్ద బోర్డులు లేక వేగంగా వస్తున్న వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి నెలలో కనీసం పది ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొందరు క్షతగాత్రులు కావడం, మరికొందరు మృత్యువు అంచువరకు వెళ్లి వస్తుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డు దాటుతున్నామని చెబుతున్నారు.

ప్రధాన రహదారికి సమీపంలోనే బ్యాంకులు, కళాశాలలు ఉండటంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

స్పందించని అధికారులు

ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దాటాలంటే పక్కన పెద్దవారు లేనిదే పిల్లలకు కనీసం సాధ్యం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ప్రమాద సూచికలు, జీబ్రా గీతలు వంటివి ఏర్పాటు చేయాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తొలి దశలోనే మచ్చలు గుర్తించాలి



పిల్లలతో ఐరన్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్ శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: రాగి రంగు మచ్చలను తొలి దశలోనే ఆరోగ్య సిబ్బంది గుర్తించి తెలియజేయాలని జిల్లా ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్ బాబు అన్నారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని బేతపూడి, ఫిరంగిపురం, వసంతనగరం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది 60 ఏళ్లకు పైబడిన వారికి వేస్తున్న బీసీజీ టీకాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు గురువారం వేసే ఐరన్ మాత్రలు, గ్రామాల్లో ఎల్‌సీడీ ప్రోగ్రాం జరుగుతున్న తీరును పరిశీలించినట్లు తెలిపారు. బీసీజీ టీకాలు ఇప్పటి వరకు ఎంతమందికి వేశారనే సమాచారాన్ని సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అల్లంవారిపాలెం పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ సిట్రోజ్ మాత్రలు మింగించారు. అనంతరం లెప్రసీ సర్వే నిర్వహించే ప్రాంతాలకు వెళ్లారు. ఇంటింటికీ తిరిగి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఆయన వెంట వైద్యులు ఫరీనాబేగం, శ్వేత, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంటీఎంసీ టౌన్ ప్లానింగ్ డీసీపీ అశోక్‌కుమార్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి , ఉండవల్లి సెంటర్‌లో తొలగించిన భరతమాత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు గురువారం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ డీసీపీ అశోక్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకట్రావుతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు విగ్రహాల ఏర్పాటుకు స్థలాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. గతంలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఈ విగ్రహాలను తొలగించామని తెలిపారు. ప్రస్తుతం ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామని వివరించారు. తాడేపల్లి బకింగ్‌హామ్ కెనాల్ వద్ద భరతమాత విగ్రహాన్ని, ఉండవల్లి సెంటర్‌లో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మోహనరంగా విగ్రహం ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్‌కు కాపు జాగృతి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామని, ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేయడంపై నియోజకవర్గ కాపు జాగృతి సంఘం అధ్యక్షులు జొన్న రాజేష్ హర్షం వ్యక్తం చేశారు.

బడేపురం ఎస్సీ కాలనీలో నీటికి కటకట



ట్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు

బడేపురం(తాడికొండ): తాడికొండ మండలం బడేపురం ఎస్సీ కాలనీలో జనం నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. మోటారు రిపేరు పేరుతో 15 రోజులుగా అరకొరగా నీటిని వదులుతుండటంతో కనీస అవసరాలకు సైతం సరిపోవడం లేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పెద్ద వాటర్ ట్యాంక్‌కు నీటిని ఎక్కించేందుకు రెండు మోటార్లు ఉండగా.. ఒకటి మరమ్మతులకు గురైంది. ఒకే మోటారుతో అరకొరగా నీటిని ఎక్కించి సరఫరా చేస్తుండటంతో శివారు ప్రాంతాలకు నీరు అందక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో నీటి కోసం బిందెలు తీసుకొని మినీ ట్యాంకుల వద్ద బారులు తీరినా ఇబ్బంది తప్పడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

డెంగీ నివారణపై అవగాహన



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ (డ్రైవర్స్ కాలనీ)లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలు పెరిగే అవకాశం ఉన్న నీటి మడుగుల్లో గంబూషియా చేపలను యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మానస వదిలారు. అనంతరం డాక్టర్ మానస మాట్లాడుతూ.. దోమల లార్వా, ప్యూపాలను ఈ చేపలు తినడం ద్వారా దోమలు వృద్ధి చెందవన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, ఎంటీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు



ఫిరంగిపురం: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేలా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో చెత్తసంపద కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకోమారు శుభ్రం చేయాలని చెప్పారు. మంచినీటి ఫిల్టర్ ట్యాంకులు శుభ్రం చేయడమే కాకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. మురుగు కాలువల్లో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో శుభ్రం చేయించాలని చెప్పారు. వీధుల వెంట చెత్త లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో విమాదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పునీత అన్నాంబ మహోత్సవాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం పునీత అన్నాంబ మహోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ ప్రిన్సిపాల్ సిస్టర్ జి.విమల మేరీ మాట్లాడుతూ మేరీమాత తల్లి అయిన అన్నమ్మ పిల్లలకు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో కూడిన విద్యాబుద్ధులను నేర్పించడంలో ఆదర్శమూర్తి అని కొనియాడారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ సిస్టర్ అమలమేరీ జోస్పిన్ మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ చదువుల తల్లిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు సిస్టర్ ఝాన్సీ, ఇతర అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి



పాఠశాలకు స్మార్ట్ టీవీని అందిస్తున్న నారాయణ దంపతులు

పాములపాడు(తాడికొండ): సమాజ సేవలోనే అత్యంత సంతృప్తి ఉంటుందని, దీనికి తమ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు పరుచూరి నారాయణ, సుశీల దంపతులు అన్నారు. తాడికొండ మండలం పాములపాడు మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు గురువారం వారు రూ.25 వేల విలువ చేసే స్మార్ట్ టీవీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఆణిముత్యాల్లాంటి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు నేటి విద్యా బోధనలో మార్పులు అవసరమని గుర్తించామన్నారు. దీనికి తమవంతు సాయంగా చిన్నారులకు స్మార్ట్ బోధనకు ఉపయోగపడేందుకు టీవీని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ చేతుల మీదుగా రిబ్బన్ కత్తిరించి టీవీని ప్రారంభించారు. దాతలతో పాటు సర్పంచ్‌ను హెచ్ఎం మహమ్మద్ గౌస్, స్థల దాత అబ్దుల్ రసూల్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ ఇబ్రహీం ఖలీలుల్లా, సీఆర్ఎంటీ అబ్దుల్ మజీద్, పాఠశాల మాజీ ఛైర్మన్ పఠాన్ ముస్తఫా, శాంతి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవో నెంబరు 117ను రద్దు చేయాలి



ఉపాధ్యాయులకు బ్యాగులు అందజేస్తున్న జోసఫ్ సుధీర్ బాబు

ఫిరంగిపురం: జీవో నెంబరు 117ను ప్రభుత్వం రద్దు చేయాలని ఆలిండియా టీచర్స్ ఫెడరేషన్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల భవనంలో గురువారం ఎస్టీయూ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన ఐఆర్ ఇవ్వాలని, పీఆర్సీ వేయాలని, టోఫెల్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. త్వరలోనే వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది 1.80 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరలేకపోయారని చెప్పారు. తమిళనాడు రాష్ట్ర తరహాలో తల్లికి వందనం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం ఉపాధ్యాయులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రవికాంత్, సంఘ నాయకులు పి.ప్రసాదు, రాజశేఖర్, బి.ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, దేవకృపామణి, జి.జోజప్ప, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

గుంటూరు ఓఎస్ఎస్ న్యాయవాది ఎ.విజయలక్ష్మి



మాట్లాడుతున్న సీడీపీవో సుజాతదేవి

ప్రత్తిపాడు: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని గుంటూరు మహిళా ప్రాంగణం వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్ఎస్) న్యాయవాది ఎ.విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మహిళలకు పని ప్రదేశాల్లో, ఇంటా, బయటా ఎదురయ్యే లైంగిక వేధింపులపై ఎలా పోరాడాలి? చట్టాలు ఎలా రక్షణగా ఉన్నాయన్న అంశాలపై వాటర్ ఇండియా సహకారంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో వి.సుజాత దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఓఎస్‌డబ్ల్యూ న్యాయవాది విజయలక్ష్మి హాజరయి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుంచి మహిళలను రక్షించేందుకు 2013లో లైంగిక వేధింపుల చట్టం అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు. అత్యవసర సమయాల్లో మహిళలు 181 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి సాయం పొందవచ్చన్నారు. మహిళలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా ఓఎస్ఎస్ సెంటరును సంప్రదించవచ్చని వివరించారు. సీడీపీవో సుజాతదేవి మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో తమ విధులను నిర్వర్తించాలన్నారు. విధుల్లో ఎదురయ్యే ఆటుపోట్లను సమర్థవంతంగా ఎదుర్కొగలిగినపుడే ఉద్యోగం సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీవో విజయనిర్మల, సూపర్‌వైజర్లు అరుణ, వెంకటరత్నం, ఇండియా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మార్పు మన నుంచే మొదలవ్వాలి



గుంటూరు ఎడ్యుకేషన్: మార్పు అనేది ఎక్కడ నుంచో రాదని, అది ముందుగా మన నుంచే మొదలవ్వాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఎవరో మారాలి, ఏదో చేయాలనే భావన విడనాడి, మన మార్పుతో సమాజంలోని సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనాలని సూచించారు. గత, ప్రస్తుత విద్యాసంవత్సరంలో సమాజ సేవ కార్యక్రమాలను నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయశైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం అభినందించారు.

కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం



మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు గురువారం తాడేపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షులు టంకసాల ఈశ్వర్ నాయుడు (ఏసుబాబు) ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ నాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. పోలవరం నిర్మించే బాధ్యత కూడా తమదేనని, రాష్ట్ర అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని కేంద్రం చెప్పిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పాలాభిషేకం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా జనరల్ సెక్రటరీ అనుమల వంశీకృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తొలిమెలి శ్రీనివాస్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు కాండ్రు భాను కిషోర్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు శివశంకరాచారి, యువ మోర్చా అధ్యక్షులు బత్తుల ఆంజనేయులు, కార్యదర్శులు తాడిపర్తి సాయి, అందే వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు వీరిశెట్టి వెంకటేశ్వరరావు, దినేష్ చక్రవర్తి, మేక నాని తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగు రక్షణకు జాగ్రత్తలు ముఖ్యం

- లాంఫాం డాట్ సెంటర్ కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేష్
- పెదపరిమి, వడ్డమాను గ్రామాల్లో పర్యటించిన శాస్త్రవేత్తలు, అధికారులు



పత్తి సాగును పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త నగేష్

పెదపరిమి(తాడికొండ): అధిక వర్షాల నుంచి పత్తి పంటను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని లాం వ్యవసాయ పరిశోధనా స్థానం డాట్ సెంటర్ కో ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ అన్నారు. గురువారం తుళ్ళూరు మండలం పెదపరిమి, వడ్డమాను గ్రామాల్లో సాగులో ఉన్న పత్తి సాగును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో 25-30 రోజుల దశలో ఉన్న మొక్కలకు పోషకాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. మెగ్నీషియం సల్ఫేట్, మల్టీ కేలను ఎకరాకు కిలో చొప్పున 2 లీటర్ల నీటితో కలిపి పత్తిపై 5 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ దశలో జీవన ఎరువులైన అజోస్పైరుల్లమ్, పాస్ఫేట్ సాల్యుబుల్ బ్యాక్టీరియా, పొటాషియం, బీజింగ్ బ్యాక్టీరియాలను అర లీటరు చొప్పున నీటిలో కలిపి ఎకరాకు నాజిల్ ఉన్న సీసా లేదా డబ్బాలో పోసి మొక్కల మొదళ్ల వద్ద పోయాలని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల నేల గుల్లబారి నేలలో లభ్యం కాని పోషకాలు మొక్కలకు సక్రమంగా అందుతాయన్నారు. గాలిలోని నత్రజని ఉపయోగించుకొని మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోండి



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన రోడ్లను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. పట్టణంలోని బుర్రిపాలెం, మెయిన్, బోసు రోడ్లను గురువారం ఆమె సందర్శించారు. రోడ్ల విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అలాగే మురుగు కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వలను బాగు చేసేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. దానిని నేటికి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కొనసాగించడం అభినందనీయమన్నారు. మురుగు కాల్వలను ప్రక్షాళన చేయడం వల్ల వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా వెంటనే వెళ్లిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏఈలు రాజు, ఫణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

- మురుగు కాల్వలో వ్యర్థాలు వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీ, చినరావూరులో జరుగుతున్న పూడిక తీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. మురుగు కాల్వలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. అలాగే బయటకు తీసిన వ్యర్థాలను అక్కడి నుంచి శివారు ప్రాంతాలకు వెంటనే తరలించే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, రామచంద్రరావు, ఏఈ రాజు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

గుర్రం జాషువా చిరస్మరణీయుడు



లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాషువా కవిత కంఠం విలక్షణమైందని అన్నారు. సాహితీ వేత్త ముప్పాళ్ళ పి.ఎస్.ప్రసాదరావు, ప్రముఖ కవి జమదగ్ని మాట్లాడుతూ జాషువా ప్రజా కవి, తెలుగు ప్రజల కవి అని నిత్య జీవితంలో కానీ సాహితీ జీవితంలో కానీ ఎన్ని కష్టాలు ఎదురైనా ఓటమి ఆయన దరి చేరలేదని ధీరత్వంతో నిబ్బరంగా నిలబడ్డారని తెలిపారు.